ప్రజాశక్తి

ఆదివారం 26 జనవరి 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

ఇంకా గుంతల రోడ్లే..!!

- గడువు ముగిసినా మరమ్మతులకు నోచని వైనం
- రూ.70.97 కోట్లతో రూ.199 పనులకు టెండర్లు
- పూర్తయిన పనులు 57, అసంపూర్తిగా ఉన్నవి 142



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రహదారులు ప్రమాదకరంగా మారాయి. సంక్రాంతి పండుగకు రహదారులు, భవనాలశాఖ (ఆర్ అండ్ బి) పరిధిలోని రహదారులపై గుంతలు పూడ్చాలనే ప్రభుత్వ ప్రకటించిన లక్ష్యం ఆచరణకు నోచుకోలేదు. వివిధ సందర్భాల్లో సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి రోడ్ల మరమ్మతులకు రూ.70.97 కోట్లతో 199 పనులకు టెండర్లు ఆహ్వానించగా, ఇప్పటికి నాలుగో వంతుకు కొంత ఎక్కువగా 57 పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో గోతుల రహదారులపై ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఈనేపథ్యంలోనే గుడివాడ-కంకిపాడు, కోడూరు-అవనిగడ్డ రోడ్లు అభివృద్ధి చేయాలని కోరుతూ రెండు నెలల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర జరిగింది. తాజాగా గుడివాడ-కంకిపాడు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ హైకోర్టు న్యాయమూర్తిని కోరుతూ గుడివాడ పట్టణ ప్రజలు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుంది.

నత్తనడకన పనులు

జిల్లాలో 1472.136 కిలో మీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారులు ఉన్నాయి. గత ప్రభుత్వం సుదీర్ఘకాలం మరమ్మతులను నిర్లక్ష్యం చేయడంతో గోతులమయంగా మారాయి. దీంతో ప్రయాణం నరకంగా మారింది. ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించుకునే క్రమంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం 245.756 కిలో మీటర్ల పరిధిలో 50 పనులకు రూ.16.70 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. గత ప్రభుత్వ హయాంలోగానీ, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలోగానీ ఇప్పటి వరకు 27 వర్కులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 23 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దశలవారీగా రహదారులపై గోతులన్నీ పూడుస్తామని ప్రకటించింది. మొదటి దశలో సంక్రాంతి పండుగకు 569.857 కిలో మీటర్ల పరిధిలో రూ.54.27 కోట్లతో 149 పనులకు రెండు విడతలుగా టెండర్లు ఆహ్వానించింది. సంక్రాంతికి పూర్తికావాల్సిన ఈ పనుల్లో కేవలం 30 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రమాదకరంగా మారిన రహదారుల మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీకి అవార్డుల ప్రదానం





రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నుండి అవార్డులు అందుకుంటున్న కలెక్టర్లు డాక్టర్ జి.లక్ష్మీశ, డి.కె.బాలాజీ

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.లక్ష్మీశ, డి.కె.బాలాజీ శనివారం 2024 సంవత్సరానికి బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం (నేషనల్ ఓటర్స్ డే) సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వారికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు, ఆయా జిల్లాల ఎన్నికల అధికార్లుగా 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, తప్పులు లేని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో అత్యుత్తమ పనితీరు కనపరిచినందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు లక్ష్మీశ, బాలాజీలను ఎంపిక చేసింది.



మ్యాంగో మార్కెట్ ముఠా కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, చిత్రంలో ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఎం.సీతారాములు, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు

రెండు కూలీలు ఇవ్వకపోతే

27 నుండి సమ్మె

- మ్యాంగో మార్కెట్ ముఠా కార్మికులకు మద్దతుగా సిఐటియు, ఎఐటియుసి హెచ్చరిక

ప్రజాశక్తి - విజయవాడ : మ్యాంగో మార్కెట్ ముఠా కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే సోమవారం నుంచి సమ్మె బాట పట్టక తప్పదని సిపిఎం, సిపిఐ నాయకులు హెచ్చరించారు. స్థానిక కేదరేశ్వరపేట మ్యాంగో మార్కెట్ ముఠా కార్మికుల విస్తృత సమావేశం శనివారం జరిగింది. ఈసందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మ్యాంగో మార్కెట్ కార్మికులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు తమ పార్టీ సంపూర్ణ మద్దతును ఇస్తోందన్నారు. మ్యాంగో మార్కెట్లో సాంప్రదాయ పద్ధతిలో ఇస్తున్న రెండు కూలీల విధానాన్ని మార్కెట్ అసోసియేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనాధిగా వస్తున్న కూలి రేట్లను గత ఏడాది సెప్టెంబర్‌లో కార్మిక సంఘాల సమక్షంలోనే అసోసియేషన్ వారు ఒప్పందం చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం దానిని అమలు చేయకుండా పలువురు వ్యాపారులు బయట వ్యక్తులను తీసుకొచ్చి పనులు చేయించడం దారుణమన్నారు. దశాబ్దాల తరబడి మార్కెట్‌ను నమ్ముకొని, అనేక రూపాల్లో ఇబ్బందులు పడుతూ ఎంతటి కష్టాన్నైనా భరిస్తూ శ్రమించే కార్మికులకు అన్యాయం చేస్తూ అసోసియేషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్మికులు ఒంటరి వారు కాదని, వారికి అండగా సిపిఎం నిలుస్తుందని అన్నారు. ఎటువంటి భేషజాలకు పోకుండా రెండు కూలీలు కార్మికులకు ఇవ్వాలని, లేకుంటే కార్మికులందరూ మూకుమ్మడిగా సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లాల్సి వస్తోందని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు మార్కెట్ అసోసియేషన్, వ్యాపారులు బాధ్యత వహించాల్సి ఉంటుదన్నారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మ్యాంగో మార్కెట్ కార్మికుల పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని తెలిపారు. జరగబోయే ఆందోళనలో కూడా పాల్గొంటుందనిన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కూలి పెంచాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ వారు కుదుర్చుకున్న (మిగతా 2లో)

మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : యువతకు ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ఐదు రోజులపాటు దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో బ్రాండ్ ఏపీని ప్రమోట్ చేసి రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆయనకు ఘనస్వాగతం పలికారు.



మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

దేశానికి మార్గదర్శి రాజ్యాంగం : ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రపంచంలోనే ప్రజాస్వామ్యానికి ఉత్తమ ఉదాహరణగా నిలిచే ఆదర్శ రాజ్యాంగం మన దేశ రాజ్యాంగమని విజయవాడ ఎంపి కేశనేని శివనాథ్ (చిన్ని) అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన ఒక ప్రకటనలో గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు బెజవాడలో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - విజయవాడ : ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్‌ను మళిస్లున్నారు. ఉదయం 8.30 నుండి 10.40 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు మంత్రులు, ఇతర ముఖ్య అతిథులు పాల్గొంటారు. అందువల్ల ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాల్లో దారి మళ్లిస్తారు. కంట్రోల్ రూమ్ వైపు నుండి బెంజ్‌సర్కిల్ వైపు వెళ్లే అన్నీ వాహనాలను ఆర్‌టిసి వై జంక్షన్ నుండి ఏలూరు రోడ్ మీదుగా స్వర్ణ ప్యాలస్, దీప్తి సెంటర్ చుట్టుగుంట, పడవలరేవు, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజ్ సర్కిల్ వైపు మళ్లిస్తారు. ఆర్‌టిసి వై జంక్షన్ నుండి బందర్ లాకులు, రాఘవయ్య పార్క్, పాత ఫైర్ స్టేషన్ రోడ్, అమెరికన్ హాస్పిటల్, మసీద్ రోడ్, నేతాజీ బ్రిడ్జ్, గీతానగర్, స్క్యూ బ్రిడ్జ్ మీదుగా బెంజ్ సర్కిల్ వైపు పంపుతారు. బెంజ్ సర్కిల్ వైపు నుండి బందర్ రోడ్‌లోకి వచ్చే వాహనాలను బెంజ్ సర్కిల్ నుండి ఫకీర్ గూడెం, స్క్యూ బ్రిడ్జ్, నేతాజీ బ్రిడ్జి, బస్టాండ్ వైపుకు మళ్లిస్తారు. రెడ్ సర్కిల్ నుండి ఆర్‌టిఎ జంక్షన్, శిఖామణి సెంటర్ నుండి వెటరినరీ జంక్షన్ వరకు ఏ విధమైన వాహనాలను అనుమతించరు. బెంజ్ సర్కిల్ నుండి డిసిపి బంగ్లా కూడలి వరకు (ఎంజి రోడ్డులో) ఉదయం 7 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు.

ఆర్‌టిసి సిటీ బస్సులు మళ్లింపు మార్గం

ఉదయం 7 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్‌టిసి "వై" జంక్షను నుండి బెంజ్‌సర్కిల్ వైపునకు ఆర్‌టిసి బస్సులు అనుమతించరు. ఆర్‌టిసి 'వై' జంక్షను నుండి బందరు రోడ్డు, రూట్ నెం.5 లో వెళ్లే ఆర్‌టిసి సిటీ బస్సులు ఏలూరు రోడ్డు మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు వెళ్లి అక్కడనుండి బెంజ్‌సర్కిలు వైపుకు వెళ్లాలి.

రెండు కూలీలు ఇవ్వకపోతే 27 నుండి సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

కూలీని కూడా అమలు చేయకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కార్మికుల పక్షాన వారికి అండగా నిలిచి పోరాడతామని అన్నారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు చేస్తున్న పోరాటానికి తాము అన్ని వేళలా అండగా నిలుస్తామని చెప్పారు. కార్మికులను శ్రమ దోపిడీ చేస్తూ, సరైన కూలి ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అసోసియేషన్ వారు ముందుకు వచ్చి రెండుకూలీల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర కార్యదర్శి ఎం.సీతారాములు, ముఠా కార్మిక సంఘం నాయకులు (ఎఐటియుసి) విపి.నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు ఇవి నారాయణ, కె.దుర్గారావు, ఎఐటియుసి నాయకులు ఎం.సాంబశివరావు, బోను శ్రీరాములు పాల్గొన్నారు.



జెండా ఊపుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సిపి రాజశేఖరబాబు



ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, సిపి ఎస్.వి.రాజశేఖర్‌బాబు

ప్రజాశక్తి - విజయవాడ : ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు అన్నారు. ప్రజాస్వామ్య పురోగమనానికి ఓటు ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో యువత తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి నుండి చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్, సిపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి మన రాజ్యాంగం పౌరులందరికీ ఓటు హక్కును కల్పించిందన్నారు. అర్హత, మతం, కులం, జాతి వంటి వివక్షకు తావులేకుండా పొందిన ఓటు హక్కును పవిత్ర హక్కుగా పరిగణించాలన్నారు. ఆరోగ్య కరమైన ప్రజాస్వామ్యం కోసం దేశంలోని యువత అత్యంత చిత్తశుద్ధితో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌డివో చైతన్య, ఎన్ఎస్ఎస్ స్టేట్ కో ఆర్డినేటర్ చంద్రమౌళి, జిల్లా కో ఆర్డినేటర్ కె.రమేష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.యుగంధర్, ఫోం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, వివిధ కళాశాలల విద్యార్థులు ప్లకార్డు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

ఓటు హక్కు పొందడం ప్రతి ఒక్కరి బాధ్యత

కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ శర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఓటు హక్కు పొందడం, ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని శనివారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జిల్లాస్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఓటర్ల డేటా ప్రకారం యువ ఓటర్ల శాతం తక్కువగా ఉందని, దీన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. అందువల్ల 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడం, ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యతగా గుర్తించాలన్నారు. డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఆధార్ మాండేటరీ ఎలాగో ఓటు హక్కు అలాగే పొందాలన్నారు. ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకుంటే ఓటర్ కార్డు ఇంటికే వస్తుంది అన్నారు. ప్రతి ఇంటిలో అర్హత గల వారందరూ ఓటు హక్కు పొందాలని సూచించారు. బందరు ఆర్డిఓ కే స్వాతి మాట్లాడుతూ అడ్వాన్సుగా 17 సంవత్సరాల నిండిన వారుకూడా ఓటరుగా నమోదు కావచ్చని, వీరికి 18 సంవత్సరాలు నిండిన రోజున ఓటర్ కార్డు ఇవ్వబడుతుందని చెప్పారు. తొలుత జాయింట్ కలెక్టర్ అందరితో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. సీనియర్ సిటిజన్ ఓటర్ వేమూరి రత్నగిరి రావు దంపతులను సత్కరించారు. అలాగే పలువురు కొత్త ఓటర్లకు ఓటర్ కార్డులు అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు. తొలుత నగరంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులచే స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద నుండి జిల్లా పరిషత్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని డిఆర్ఓ కె చంద్రశేఖర రావు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఓటు విలువ తెలుసుకో, ఓటు హక్కు మనందరి బాధ్యత వంటి నినాదాలతో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో డీఈవో పివిజె రామారావు, ఆర్ఐఓ సాల్మన్ రాజు, డిఎస్‌డిఓ ఝాన్సీ లక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ డిఇఓ శేఖర్ సింగ్, ఎంఈఓ దుర్గాప్రసాద్, తహాశీల్దార్లు నాగభూషణం, మధుసూదన్ రావు, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

ఓటు హక్కుపై అవగాహన అవసరం : మేయర్

ప్రజాశక్తి - విజయవాడ : ఓటు హక్కుపై అందరికీ అవగాహన అవసరమని విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద మేయర్ భాగ్యలక్ష్మి.... విఎంసి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు వేయడం అందరి బాధ్యతని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా యువ ఓటర్లుగా వారి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, సూపరింటెంటింగ్ ఇంజనీర్ వర్క్స్ పి సత్యనారాయణ, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, మేనేజర్ ఏయూబి శర్మ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం : కాంగ్రెస్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గొల్లు కృష్ణ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో శనివారం కలక్టరేట్ ధర్నా చౌక్ లో ధాలీబజావో ప్లేట్లు గరిటలతో మోగించి తాము ఇచ్చిన హామీలను మరచి నిద్రపోతున్న ప్రభుత్వాన్ని నిద్రలేపే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లు కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు సూపర్ సిక్స్ అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హెూదా పై మాట్లాడలేకపోతున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థులకు విద్యా దీవెన, రైతులకు చేయూత, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ఆర్థిక భరోసా, ఇలాంటి హామీలన్నీ నీటి మూటలుగా మారిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి

భారత పార్లమెంటులో భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కలెక్టరేట్ నుండి మహాత్మా గాంధీ విగ్రహం మీదుగా లక్ష్మీ టాకీస్ సెంటర్లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి బాపూజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గం అసెంబ్లీ కోఆర్డినేటర్ ధనేకుల మురళీమోహన్ రావు, పామర్రు నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్ మరియు పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహన్ రావు, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ప్రజాశక్తి-గుడివాడ : విజయవాడ మెయిన్ రోడ్డులో బేతవోలులోని ఆదిత్య వాటర్ ప్లాంట్ దగ్గర ఉన్న మురుగు కాలువ లో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు 1టౌన్ సిఐ కె.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధుడి వయ్యసు సుమారు 60 నుండి 70 ఉంటుందన్నారు. మృతి చెందిన వ్యక్తి తెలుపు రంగు మాసిన గడ్డంతో, నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ దరించినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 1టౌన్ పోలీస్ స్టేషన్‌కి తెలియజేయాలని తన ప్రకటనలో పేర్కొన్నారు.



ప్రమాద బాధితుడికి సామాను అందిస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని బందరుకోట ప్రాంతంలో కొన్ని రోజుల క్రితం వాటాల శ్రీనివాసరావు కుటుంబానికి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. కట్టుబట్టలు మినహా సామాను మొత్తం తగలబడి బూడిద అయిపోవడంతో నిరాశ్రయు లుగా మారారు. అప్పటినుండి వారు సాయం కోసం ఎదురుచూస్తున్నారని స్థానికుల ద్వారా తెలుసుకున్న మైత్రీ బందం వెంటనే స్పందించి శనివారం వారికి అత్యవసరమైన వంట సామాగ్రి పాత్రలు. గ్యాస్ పొయ్యి మొదలైన 10 వేల రూపాయలు విలువ గల వస్తువులు వితరణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

4లోకేష్ స్వాగతం పలుకుతున్న నేతలు,

మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : యువతకు ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ఐదు రోజుల పాటు దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో బ్రాండ్ ఏపీని ప్రమోట్ చేసి రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఐటీ , విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఎంపి కేశినేని శివనాథ్(చిన్ని) తో పాటు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవి నాయుడు శనివారం ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో మంత్రి నారా లోకేష్ ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలకు, పలు సంస్థల సీఈవోలకు ఏపీలో అనుకూలతలను వివరించి రాష్ట్రానికి ఆహ్వానించారని ఎంపి కేశినేని శివనాథ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజక వర్గ పరిధిలోని కార్మిక వర్గాల సంక్షేమానికి తాను అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 'మీ కోసం మీ వెనిగండ్ల' పర్యటనను ఎమ్మెల్యే రాము నిర్వహించారు. పట్టణంలోని సత్యనారాయణపురం, గౌరీశంకరపురంలో ఎమ్మెల్యే రాము పర్యటన నిర్వహించారు. ఎమ్మెల్యే రాము పలు ప్రాంతాల్లో సమస్యలపై స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనతరం ఏలూరు రోడ్డులోని ఆర్కే కాంప్లెక్స్ వద్ద తాపీ కార్మికులతో మాట్లాడి కార్మిక వర్గాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, రాము వ్యక్తిగత సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయకాలం పర్యటనలో ఎమ్మెల్యే వెనిగండ్ల

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ



ప్రజాశక్తి - తోట్లవల్లూరు : పుదిచ్చేరిలో జరిగిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ లో తోట్లవల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యుడు ఫణి రాజ మోహన్‌కు రెండవ స్థానం దక్కింది. శని వారం ఆయన పత్రికా ప్రకటనలో తెలుపుతూ సాధించిన షీల్డ్,ప్రశంసా పత్రాలను చూపారు. గణితంలోని క్లిష్టమైన లెక్కలను విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా మెటీరియల్ రూపొందించి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ లో స్థానం సంపాదించి ఈనెల 20 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగిన సైన్స్ ఫెయిర్ లో పాల్గొని రెండో స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, డాక్టర్.జ్యోతిచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శివాలయం రోడ్డులో నాగళ్ల రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు, కాగిత కష్ణచంద్, మెదడు, వెన్నుముక శస్త్ర వైద్య నిపుణులు కాగిత రాకేశ్, సెంటినీ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది పాల్గొని బీపీ, షుగర్, గుండె వైద్యపరీక్షలు ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారని అన్నారు. ఉయ్యూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవ కాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో నాగేశ్వరావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంను పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని అన్నారు. ఈనెల 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డి.సి చైర్మన్ బోర్ర కాశి, తాత రాజా, ఈడే లింగేశ్వరావు, సూరయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** మండల పరిధిలోని పాగోలులో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో గేదలకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కోళ్లకు వైరస్ రాకుండా వ్యాక్సిన్ వేశారు. జడ్పిటిసి సభ్యురాలు రాజుల పార్టీ కళ్యాణి, ఎంపీటీసీ సభ్యులు మేకా సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయవాడలో కిడ్నాప్... కోడూరులో ప్రత్యక్షం



ప్రజాశక్తి-కోడూరు : కోడూరు చెందిన ఓ మహిళ గురువారం విజయవాడలో రెండున్నర సంవత్సరాల బాలుడిని కిడ్నాప్ చేసింది. ఈ విషయంపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు సీసీ కెమెరాలు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. బాలుడిని కిడ్నాప్ చేసిన మహిళ కోడూరు తీసుకువచ్చిందని సమాచారంతో అవనిగడ్డ పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా అవనిగడ్డ పోలీసులు, విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, కోడూరులో గాలింపు మొదలుపెట్టారు. ఈ విషయాన్ని గమనించిన మహిళ ఆ బాలుడిని కోడూరు 3 వార్డులో ఎంఆర్‌సి భవనం పక్కన ఉన్న డ్రైనేజీలో పడేసింది. హుటాహుటాన డ్రైనేజీలో పడేసిన బాలుడిని పోలీసులు బయటకు తీసి స్థానికులు సహాయంతో స్నానం చేయించి దుస్తులు అందించారు. కిడ్నాప్ చేసిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని సురక్షితంగా వారి కుటుంబ సభ్యులు అప్పగించారు. నగదు కోసమే మహిళ బాలుడిని దొంగలించినట్లు తెలుస్తోంది.



గంగాధరరావుకు పలువురు నివాళి

ప్రజాశక్తి-పమిడిముక్కల : విశ్రాంత ఉపాధ్యాయుడు మైనేని గంగాధరరావు మృతి బాధాకరమని, ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని వైసిపి నాయకులు, మాజీ ఎంపీపీ సొంటి వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని పైడికొండలపాలెంలో మైనేని గంగాధరరావు మృతదేహానికి పలువురు వైయస్సార్ పార్టీ నాయకుల నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో వారికి మార్గదర్శకుడు అయ్యారని ఆయన అన్నారు.గంగాధరరావుకు నివాళులర్పించిన వారిలో వైయస్సార్ పార్టీ నాయకులు పాతూరు చంద్రపాల్, కొడమంచిలి మహేష్, ముళ్ళపూడి నాగార్జున, కొక్కిలిగడ్డ ఆనంద్, శివరామకృష్ణ, మారపాక మహేశ్వరరావు, యార్లగడ్డ శివ ఉన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం గంగూరు గ్రామంలో 12 లక్షల రూపాయలతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ బోడేప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభి వద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తాడిగడప మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

కెఎస్ లక్ష్మణరావును ఎంఎల్‌సిగా గెలిపించాలి

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తూ...ఉద్యోగ, కార్మిక, పెన్షనర్స్, ఇతర రంగాల్లోని వారి హక్కుల కోసం పిడిఎఫ్ తరుపున నిరంతరం శాసన మండలిలో పోరాడుతున్న తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి మరో సారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. స్థానిక బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు (ఎన్‌పిఆర్) భవన్‌లో ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు, ఉద్యోగ,కార్మికుల సమస్యలపై అటు శాసన మండలి లోపల, ఇటు బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. శాసన మండలిలో ఉద్యోగ, కార్మికుల, ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి శక్తివంచన లేకుండా పని చేయాలని పలు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎంవి సుధాకర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కమల, ఎల్ఐసి యూనియన్ నాయకులు తులసిరావు, మధ్యతరగతి ఉద్యోగుల సంఘం బాధ్యులు విజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు.



ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఓటు నమోదు ఉత్తమ అధికారులకు అవార్డులు

ప్రజాశక్తి - నందిగామ : ఉత్తమ ఓటర్ల నమోదు అధికారిగా ఎంపికైన నందిగామ ఆర్‌డిఓ కె.బాలకృష్ణకు ఎపి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) విజయానంద్ చేతులమీదుగా ఉత్తమ ఓటరు నమోదు అధికారి (ఇఆర్‌ఒ) అవార్డు అందుకున్నారు.

విస్సన్నపేట : ఓటర్ల నమోదు ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విస్సన్నపేట తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి ఓటరు నమోదు ఉత్తమ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ విజయానంద్ ఆమెను అభినందించారు.



విద్యుద్దీపకాంతులతో మున్సిపల్ కార్యాలయం ముస్తాబు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పురపాలక సంఘ కార్యాలయం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నందిగామ మున్సిపల్ ఆఫీసును సర్వాంగ సుందరంగా మువ్వన్నెల జెండాను పోలిన రంగురంగుల విద్యుత్ దీపాలతో చేసిన అలంకరణ చూపరులను ఆకట్టుకొంటుంది. నందిగామ మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు ప్రత్యేక శ్రద్ధ వహించి సుందరంగా తీర్చిదిద్ది నగరవాసుల మన్ననలు పొందుతున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు కూడా నందిగామ మున్సిపల్ కార్యాలయం విద్యుత్ దీపకాంతులతో మెరిసి పోయింది. రిపబ్లిక్ డే నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం జెండా వందన కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పురపాలక సంఘ కార్యాలయం అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 50వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ బోయి సత్యబాబు కోరారు. శనివారం ఈ పనుల నిమిత్తం సిఇ శ్రీకాంత్ రెడ్డి ఇఇ వెంకటేశ్వర్ రెడ్డి డిఇ కరుణాకర్ ఎఇ శ్రీనివాసరావుతో కలిసి ఆయన గొల్లపాలెం గట్టు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో నీటి కొరత లేకుండా హెడ్‌వర్క్స్ పంపింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పాడైపోయిన బోరింగ్‌లు లీకేజీ పైపులు రిపేర్లు వెంటనే చేయాలని కోరారు. వాటర్ ట్యాంక్ రిపేర్ పనులు త్వరిత గతన ప్రారంభించాలని కొత్తగా రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు డివిజన్లో పెండింగ్లో ఉన్న రిటైనింగ్ వాల్ నిర్మాణాలు కమిటీలు మంచినీటి రిజర్వాయర్ పనులు రోడ్డు రిపేర్ వర్కులు అన్నీ త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో డివిజన్‌నాయకులు పి.రాజు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సత్యబాబు

గంజాయి కేసుల్లో 12 మంది అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ : గంజాయి కేసులో 12 మందిని అరెస్టు చేసి నిందితుల వద్ద నుండి సుమారు ఒక లక్షా 40 వేల రూపాయల విలువైన 23 కేజీల గంజాయి సిటీ టాస్క్ ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిటీ టాస్క్ ఫోర్సు, లా అండ్ ఆర్డర్ బృందాలకు అందిన సమాచారం మేరకు నగరంలోని వివిధ ప్రదేశాల్లో అనుమానంగా తిరుగుతున్న ఈ 12 మందిని అదుపులోనికి తీసుకున్నారు. వీరంతా వేర్వేరు మార్గాల ద్వారా గంజాయికి అలవాటు పడి, సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి వాటిని విజయవాడలోని పలు ప్రాంతాలలోని యువకులకు అమ్మి



వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానితులు కనిపిస్తే 9121162475 నెంబర్‌కు నార్కోటిక్ సెల్ పోలీస్‌కు సమాచారం ఇవ్వగలరని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : విద్యార్థులు చదువులో అత్యధిక మార్కులతో పాస్ అవ్వాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్క సత్యనారాయణ అన్నారు. మండలంలోనే డిపిఆర్‌టియు శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్ నక్క పేట జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రధానోపాధ్యాయులు చిత్రాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు కావాలని ఒక ఉపాధ్యాయుడు మాత్రమే కోరుకుంటాడు . డిపిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ రాష్ట్రములోని ఆయా విషయ నిపుణుల చేత తయారు చేయబడిన ఈ స్టడీ మెటీరియల్ 10వ తరగతి విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టి ఎక్కువ మార్కులు సాధించేలా రూపొందించబడిందని తెలిపారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ చిత్రాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కువ మార్కులు సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ ఎ.శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.మల్లేశ్వర, జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవింద్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి - విస్సన్నపేట : నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కెఎస్.లక్ష్మణ్ రావు, ఎంఎల్‌సిగా తిరిగి గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య పిలుపునిచ్చారు. ఆయన పిలుపుమేరకు శనివారం రాత్రి విస్సన్నపేట స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ప్రజా సంఘాలు, యూటిఎఫ్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సుందరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలన్నా, నిరుద్యోగులు కార్మికులు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం లక్ష్మణరావును తిరిగి శాసన మండల సభ్యుడిగా గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బిసి హెచ్‌వి. సూర్యనారాయణ ఏలూరు జిల్లా కార్యదర్శి వీర కోటి



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

విస్సన్నపేట మండల శాఖ అధ్యక్షులు కార్యదర్శులు ఏ మురళి, సిహెచ్ చంటిబాబు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు ప్రజా సంఘాల నాయకులు మేకల జ్ఞాన రత్నం, కరెడ్ల ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నందిగామ :

ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించాలని నందిగామ ఆర్‌టిఒ పద్మావతి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా నందిగామ పిఎస్‌సి బోస్ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందుతున్న, పిఎస్‌సి బోస్, అన్నపూర్ణ హెవి మోటార్ వెహికల్ డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. నందిగామ ఆర్‌టి ఒయం.పద్మావతి మాట్లాడుతూ వాహనాలు అతి వేగంగా నడపటం వల్ల, ప్రమాదకరంగా వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు. జగ్గయ్యపేట మోటార్ వాహన తనిఖీ అధికారి ఎంవిఐ రాజు మాట్లాడుతూ వాహనం ఓవర్ టేక్ చేసేటప్పుడు కుడివైపు మాత్రమే చేయాలని, రాంగ్ డైరక్షన్‌లో ప్రయాణం చేయకూడదని తెలిపారు. సింగల్ రోడ్డులో ఓవర్ టేక్ చేయకూడదని, మత్తు పదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. నందిగామ మోటార్ వాహన తనిఖీ అధికారి ఎం.పూర్ణిమ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించే దిశగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నందిగామ బైపాస్ రోడ్డులో పోలీస్, రవాణాశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ డ్రైవ్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సిపిఎం మాజీ సర్పంచ్ మోహన్‌రావు వర్ధంతి

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి సిపిఎం మాజీ సర్పంచ్, మైలవరం సమితి ఉపాధ్యక్షులుగా, ప్రజా డాక్టర్‌గా పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించి , కొండపల్లి పారిశ్రామిక అభివృద్ధి, విటిపియస్ కీ బీజం వేసిన కొండపల్లి కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రజా నేత డాక్టర్ ఎం.వి.మోహన్‌రావు 51వ వర్ధంతి కార్యక్రమాలు కొండపల్లి మోహన్‌రావు నగర్, డాక్టర్ మోహన్ రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో నిర్వహించారు. కొండపల్లి మోహన్‌రావు నగర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. డాక్టర్ ఎంవి.మోహన్‌రావు కుటుంబ సభ్యులు డాక్టర్ ఎం.సీతారామారావు, డాక్టర్ యం రత్న మోహన్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పి.కామేశ్వరరావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు. శిబిరాన్ని శనివారం డాక్టర్ సూరపనేని సుధాకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ మామిడి మోహనరావు స్ఫూర్తితో ఆయన కుమారుడు డాక్టర్ మామిడి సీతారామారావు 25 సంవత్సరాల నుంచి కొండపల్లి పరిసర ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించడం అభినందనీయ మన్నారు. డాక్టర్ మామిడి సీతారామారావు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మామిడి రత్న మోహన్ రావు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ లో ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంప్లెక్స్ ట్రామా, విరిగిన ఎముకలు అతికించడం, మోకాలు మార్పిడి శస్త్రచికిత్స, ఆర్థోస్కోపిక్ సర్జరీ (కీ హోల్స్ సర్జరీలు) చేస్తున్నట్లు వివరించారు. శిబిరంలో సుమారు 250 మందికి బోన్ డెన్సిటోమెట్రీ – షుగర్, కొలెస్ట్రాల్, ఈసీజీ పరీక్షలు చేశారు.

ఉత్తమ ఓటరు సిటిజన్ కౌన్సిలర్ అమరయ్యకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : ఉత్తమ ఓటరు సిటిజన్‌గా కౌన్సిలర్ మారం అమరయ్యను శనివారం నందిగామలో ప్రభుత్వ ఉద్యోగులు సన్మానించారు. నందిగామ 4 వార్డు సచివాలయంలో శనివారం ఓటర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ అధికారులు నాల్గో వార్డు కౌన్సిలర్ మారం అమరయ్యను సన్మానించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి కంచికచర్ల : సుక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కంచికచర్ల ఎస్‌ఐ బి.రాజు తెలిపారు. కంచికచర్ల ఒకి క్లబ్ వద్ద రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారికి శనివారం ఎస్‌ఐ బి.రాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బి.రాజు మాట్లాడుతూ చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ లేని కారణంగా తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారని హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహనాదారులకి వివరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : రాజ్యాంగంపై, అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగంపై దాడిగా పరిగణించి తక్షణమే అమిత్‌షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. పిసిసి ఆదేశాల మేరకు శనివారం కంచికచర్లలో రాజ్యాంగం స్ఫూర్తిని ప్రతి పౌరునికి తెలియాలనే సంకల్పంతో కరపత్రాలను పంపిణీ చేశారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, అనే కార్యక్రమంలో భాగంగా కంచికచర్ల పట్టణంలో చెవిటికల్లు సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా, జాతీయ రహదారిపై పలు దుకాణాలలో బాటసారులకు రైతు బజార్లో రాజ్యాంగ ప్రకటన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వజ్రయ్య, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు చిలుకూరి సర్పంచ్ గొంది సురేష్ గింజపల్లి అనిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొటారు రవిబాబు, నాయకులు సూదులు పూర్ణ నారిసెట్టి శ్రీనివాసరావు అక్కల ప్రసాద్ పాల్గొన్నారు.

బాలికల దినోత్సవం

విజయవాడ : విజయవాడ సత్యనారాయణపురంలోని ఎకెటిపిపి మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వారు మాట్లాడుతూ జాతీయ బాలిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, బాగా చదువుకోవాలని సూచించారు. హ్యాపీలైఫ్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక మంచి నిర్ణయం తీసుకొని భవిష్యత్తులో అత్యున్నత స్థానాల్లో ఉండాలని అన్నారు. అనంతరం బాలికలకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. రైల్వేలో పనిచేస్తున్న మెరిసి ప్రసాద్ ఆర్థిక సహకారంతో ఈ పోటీలో పాల్గొన్న బాలికలకు బహుమతులు అందించారు. సుచరిత, సుబ్బలక్ష్మి, శివ నాగలక్ష్మి, సుజాత, పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాలల ఎన్టిఆర్ ట్రోఫి స్కూల్ గేమ్స్ఒ స్పోర్ట్స్ పోటీలను స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే రాము ప్రారంభిం చారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే రాము వారితో మాట్లాడుతూ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, సమయపాలన, క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 2టౌన్ సిఐ దుర్గాప్రసాద్, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, చేకూరు జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

31న బియ్యం బహిరంగ వేలం : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజా పంపిణీ వ్యవస్థలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 739.11 క్వింటాళ్ల బియ్యాన్ని బహిరంగ వేలం వే స్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం లోని జెసి కార్యాలయం వద్ద ఈ నెల 31 వ తేదీ ఉదయం 10.30.గంటలకు బహిరంగ వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద 50 వేల చొప్పున జిల్లా పౌరసరఫరాల అధికారి, కష్ణాజిల్లా, మచిలీపట్నం వారికి చెల్లించి నిర్ణీత నమూనాలో దరఖాస్తులను సమర్పించి వేలంపాటలో పాల్గొనవచ్చునన్నారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని గీతికాప్రియ

చిత్రలేఖనం పోటీల్లో 'కొమ్మారెడ్డి' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలోని మున్సిపల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తమ స్కూల్ విద్యార్థి గీతికా ప్రియ (8వ తరగతి)జిల్లాలో ద్వితీయ స్థానం సాధించించినట్లు స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం విద్యార్థినికి బహుమతి అందించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన స్కూల్ కరెస్పాండెంట్ శోభ , స్కూల్ హెచ్‌ఎం ఎన్. శ్రీనివాసరావు , విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

- సిజిఆర్ఎఫ్ చైర్మన్ ఇమ్మానుయేల్



వినియోగదారుల సమస్యలు వింటున్న ఇమ్మానుయేల్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : విద్యుత్ వినియోగదా రులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సిజిఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు.పెడన పట్టణంలోని ది పెడన ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కన్స్యూమర్ గ్రీవెన్స్ సెస్ రిడ్రసెల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిజిఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ సిజిఆర్ఎఫ్ వివిధ విభాగాల సభ్యులు పాల్గొని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించారు.పెడన సబ్ డివిజన్ పరిధిలో బిల్లులు మరియు సబ్సిడీ సంబంధిత అపరిష్కృతంగా ఉన్న 12 సమస్యలు రాగ అందులో రెండు సమస్యలకు వెంటనే పరిష్కరించగా మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన అన్నారు. వినియోగదారులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా, సమస్యల విషయంలో జాప్యం జరిగితే విజయవాడ గుణదలలోని సిజిఆర్ఎఫ్ కార్యాలయంలో సంప్రదించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిజిఆర్ ఎఫ్‌మెంబర్ టెక్నికల్ కె. వెంకటకష్ణ, సిజిఆర్ఎఫ్ మెంబర్ ఫైనాన్స్ ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు , మెంబర్ ఇండిపెండెంట్ ఎ. సునీత, డిఇలు తదితరులు పాల్గొన్నారు.

ఉషారామాలో ముగిసిన యువర్ పెస్ట్



ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలవారిగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువజన ఉత్సవాలు ఏర్పాటు చేస్తున్నామని ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాల లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యువర్ పెస్ట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన తెలుగు అమ్మాయి పోటీల్లో మొదటి బహుమతి పి భార్గవి, రెండవ బహుమతి రసికా బేగం, మూడవ బహుమతి అనూష గెలుపొందారు. అమ్మాయిల చలాకి తనం, సమయ స్ఫూర్తి తెలుగు సంస్కృతి పట్ల అవగాహన పరీక్ష చేయడానికి నాలుగు రౌడ్ల పోటీల్లో వివిధ కళాశాల లకు చెందిన 84 మంది విద్యార్థినులు ఫాల్గొన్నారు. వీటితో పాటు డ్యాన్స్, సిమ్మింగ్, మిష్టర్ పర ఫెక్ట్, స్పాట్ ఫోటో గ్రఫీ లాంటి పోటీల్లో విద్యార్ధిని విద్యార్థులు తమ ప్రతిభను కనభరిచి బహుమతులను గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సుంకర రాంబ్రహ్మం, ప్రిన్స్‌పాల్ డాక్టర్ ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వహణ కన్వీనర్లు గా డాక్టర్ రాం చౌదరి, డాక్టర్ నవీన్ లు వ్యవహరించారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలోని ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ లలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ శిక్షణ్ పేరిట ఫిబ్రవరి 1 తేదీ నుండి 2025 మార్చి 31 వరకు శిక్షణ ఇచ్చుటకు ఏజెన్సీల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్ర శిక్ష ఎపి సి. ఫణి ధూర్జటి తెలిపారు. దరఖాస్తు చేసే ఏజెన్సీ వారు విద్యా సంస్థల్లో స్వీయ రక్షణ శిక్షణను నిర్వహించడంలో ముందస్తు అనుభవం ఉండాలని, ఏజెన్సీ అందించే శిక్షకులకు తప్పనిసరిగా కనీసం ఒక మార్షల్ ఆర్ట్ లేదా ఆత్మరక్షణ క్రమశిక్షణలో (ట్రైక్వాండో, కరాటే, జూడో, క్రావ్ మాగా) సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 28 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయము, మచిలీపట్నంలో అందజేయాలన్నారు.

10న అరుణాచలానికి బస్సు సర్వీస్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి ప్రతినెల ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అరుణాచలానికి మరో తొమ్మిది ప్రముఖ దేవాలయాలు సందర్శించేటట్లుగా ఫిబ్రవరి 10వ తేదీన ఒక సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపార.ు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆలయాల సందర్శనకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్కు రూ 3 వేల రూపాయలు చార్జీతో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అర్ధవీడు, అరుణాచలం, విష్ణుకంచి, శివకంచి, కామాక్షమ్మ గుడి, తిరుత్తని శ్రీకాళహస్తి మొదలైన పుణ్యక్షేత్రాలు సందర్శించుకొని వచ్చే విధంగా నాలుగు రోజుల యాత్రతో ఈ బస్సు నడపబడుతున్నట్లు చెప్పారు. పదో తేదీ సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరి రేపల్లే బాపట్ల చీరాల మీదుగా వెళుతుందని అన్నారు. ు సీట్లు కావలసినవారు వెంటనే ఈ బస్సునకు సీట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 7036 335 079, 9959225466 సంప్రదించాలన్నారు.

జిల్లాల హద్దులు గుర్తింపు



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని ఐలూరు శివారు కనిగిరిలంక గ్రామ సమీపంలో రెవెన్యూ శాఖ అధికారులు శనివారం హద్దులను గుర్తించి సరిహద్దురాళ్ళను ఏర్పాటు చేశారు. కష్ణా,గుంటూరు, బాపట్ల జిల్లాల కు సంబంధించిన సరిహద్దులను గుర్తించినట్లు, ఈ హద్దులకు చిహ్నాలు రూపొందించినట్లు తాసిల్దార్ కుసుమకుమారి తెలిపారు. ఈ సర్వేలలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్ జోషిలా, జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శివరాం ప్రసాద్, డిప్యూటీ తాసిల్దారు వెంకటేశ్వరరావు, సర్వేయర్ రామకష్ణ, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లనపల్లి రోడ్డుకు మహర్దశ



తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నుంచి ఆగిరిపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులకు 2021లో సుమారు రూ.30 కోట్లతో వైకాపా ప్రభుత్వం శంకుస్థాపన చేసి... రోడ్డును తవ్వి వదిలేసింది. సుమారు మూడేళ్లపైగా భారీ గుంతల రోడ్డుపై ప్రయాణం చేయ లేక చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఎగసిపడే దుమ్ము ధూళితో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రోగాలబారిన పడ్డారు. కూటమి ప్రభుత్వం చొరవతో ఇప్పుడు తారు రోడ్డు వేస్తున్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం


కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కృష్ణా జిల్లా కమిటీ, మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో 2025 నూతన డైరీని శనివారం స్థానిక జ్యోతి రావు పులే విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సామాజిక అంశాలు పైనే కాకుండా ఈ సమాజం మారాలని కుల తత్వ విధానానికి మతతత్వ విధానానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. నేటికీ కష్ణాజిల్లాలో అనేక గ్రామాల్లో శ్మశానాలు లేని దుస్థితి ఉందని, 1235 జీఓ ఎక్కడ అమలు జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు సుధాకర్, రాంబాబు , విల్సన్, మండల అధ్యక్ష కార్యదర్శులు పేటేటి రాజు మిరియాల ఆనంద్ బెనర్జీ , కె వి పి ఎస్ మండల కమిటీ నాయకులు రమేషు, భాను వసంతరావు, బాబురావు ,వరలక్ష్మి ,మధ్యతరగతి ఉద్యోగ సంఘ నాయకులు టి చంద్ర పాల్ తదితరులు పాల్గొన్నారు.

'విజయ క్రాంతి' కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యార్థులు పరిపూర్ణ విజ్ఞానవంతులు కావాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ఫేర్ వెల్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మార్కుల సాధనే పరిపూర్ణ జ్ఞానం కాదని, విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కూడా పొందాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ లో చెడు సహవాసాలకు గురి కాకుండా ఉత్తమ నడవడికతో ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, సీఐ కే.ఈశ్వరరావు, కష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా, గ్రామ ప్రముఖులు అడపా రాంబాబు, విద్యాసంస్థ చైర్మన్ దుట్టా ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గూడూరు ఎంపిడిఒగా అనూహ్య



ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండల ఎంపీడీవోగా టి. అనూహ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల ఎంపీడీవో గా పనిచేస్తున్న ఆమె ఆగస్టు 2024 నుంచి సెలవులో ఉన్నారు. సెలవు ముగించుకుని విధుల్లో చేరిన ఆమెను గూడూరు ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల సహకారం తో మండల అభివద్ధి కి కషి చేస్తానని తెలిపారు.

గన్నవరం తహశీల్దారుకు అవార్డు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం తహసీల్దార్, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారిగా విధులు నిర్వహిస్తున్న కట్ట వెంకట శివయ్యకి అత్యుత్తమ గౌరవం లభించింది. 2024 సంవత్సరానికి గానూ రాష్ట్రస్థాయి ఉత్తమ ఎన్నికల అభ్యాస పురస్కారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి విజయానంద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

శ్రీవాహినిలో రహదారి భద్రతా మాసోత్సవాలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. విజయవాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శివరామగౌడ్ రహదారి భద్రతా సంకేతాలు, మార్కింగ్ గురించి విద్యార్థులకు, కళాశాల వ్యాన్ డ్రైవర్లకు వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఉమామహేశ్వరరావు వివరించారు. విద్యార్థులు అం దరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ రంగా నాగేంద్రబాబు, కోశాధికారి ముత్యాల కిషోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి కెవి.ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలో జరిగే పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం మెరుగుపరచడంలో, వాటి ఉత్పాదకతను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వ సహకారం తీసుకోవాలని, పశువుల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని, పశుసంవర్ధనలో సాంకేతికతను పాటించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంలో పశువుల సహకారం తీసుకోవాలని తద్వారా మానవాళి ఆరోగ్యాన్ని పెంపొందించాలని నాగేశ్వరరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి తులసి, రాజారావు గ్రామ పశు పోషకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని అన్నేరావుపేటలో సిమెంట్ రోడ్ల పనులను టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సహకరించారని నాగేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో సదుపాయాలను మెరుగుపరచడానికి ఈ రోడ్ల నిర్మాణం ఒక కీలకమైన అడుగు అని నాగేశ్వరరెడ్డి తెలిపారు.

ఘనంగా సాంకేతిక ఉత్సవ లక్ష్య

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక ఎల్‌బిఆర్ సిఇ కళాశాలలో 18వ సాంకేతిక సాంస్కృతిక ఉత్సవ లక్ష్య 2కె25 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌బిఆర్ సి కళాశాల కో ఫౌండర్, హానరరి చైర్మన్ లక్కిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా కావలసిన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. లీడర్షిప్, క్వాలిటీస్‌ను అభివృద్ధి చేసుకుంటూ అన్ని అంశాలలో నైపుణ్యతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సాంకేతిక విభాగంలో మేధా, సృజన, ప్రజ్ఞ, ఉద్భావన, రంగమార్తాండ, ఓజాస్, డాన్స్, ముకాభినయం, పాటల పోటీలు మొదలగు ప్రత్యేక విభాగాల్లో కలిపి మొత్తం 62 విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు కన్వీనర్ ఏరోస్పేస్ విభాగాధిపతి డాక్టర్ పిలోవరాజు, ఎంబిఏ విభాగాధిపతి ఎ.ఆదిశేషారెడ్డి తెలిపారు. వివిధ విశ్వవిద్యాలయాల నుండి 1832 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ రెడ్డి వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువుల విక్రేతలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఎరువుల కొరత సృష్టించి బ్లాక్‌లో రైతులకు అధిక ధరలకు అమ్ముతున్న ఎరువుల వ్యాపారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. దాళ్వా సాగుచేసిన రైతులు యూరియా, గుళికలు, పొటాషియం తదితర ఎరువులను ఎమ్మార్పీ కంటే బస్తాకు అదనంగా రూ.100 నుండి 150 లు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, అదేమని అడిగితే స్టాక్ లేదని, కొరతగా ఉందని వ్యాపారులు చెబుతున్నారని ఆయన అన్నారు. ఎంఆర్‌పి ధరకు లభించే సొసైటీలలో ఎరువులు లేకపోవడంతో వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారని నాగేశ్వరరెడ్డి చెప్పారు. గుంటూరు నుండి వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి ఐటీవల స్టాక్ రిజిస్టర్‌లో లేని ఎరువులను సీజ్ చేసిన ఎరువుల దుకాణాల పేర్లను బయట పెట్టాలని నాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి ఎరువులకు కొరత లేకుండా ఎంఆర్‌పి ధరలకే అమ్మేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కళాశాలల్లో, పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రముఖ అధికారులు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద మేయర్ రాయన భాగ్యలక్ష్మి కార్పొరేషన్ సిబ్బందితో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ వర్క్స్ పి.సత్యనారాయణ, ఇన్చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, మేనేజర్ ఎయు బి.శర్మ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఇన్చార్జి అడ్మిన్ డిసిపి కృష్ణమూర్తి నాయుడు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయించారు. సిపిఐ, సిసిఆర్‌బి, ఎస్‌బి అధికారులు, సిబ్బందితో సమావేశమై ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఆవశ్యకత తెలుపుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి. ఎసిపి ఎస్ కిరణ్ కుమార్, సిసిఆర్‌బిఎ సిపి వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, సిపిఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **మైలవరం :** జాతీయ ఓటర్ల దినోత్సవం డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలవరం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ (డిప్యూటీ కలెక్టర్) ఎం.శ్రీనివాసు మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సీనియర్, యంగ్ ఓటర్లను సన్మానించారు. తహశీల్దార్ అబ్దుల్ దరియా, డిప్యూటీ తహశీల్దార్ మోతియా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ సుశీలదేవి, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, నాదెండ్ల చెన్నకేశవరావు, కిరణ్ కుమార్ రెడ్డి, గ్రామ ప్రజలు, స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు.పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రైజులు అందజేశారు. **మైలవరం :** స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ సందర్భంగా పుల్లూరు సర్పంచ్ కె.నాగమల్లేశ్వరి మాట్లాడారు. **విజయవాడ :** ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి సిబ్బంది డి.రమేష్ , పివివి.ఫణి బాబు పాల్గొన్నారు. చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్య నారాయణ పురం నందు 15 వ, భారత జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ గ్రంథాలయ సిబ్బంది, పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యువతకు 'జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రాముఖ్యత' అను అంశంపై నిర్వహించిన చర్చా పోటీల విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. **తిరువూరు :** జాతీయ ఓటర్ల దినోత్సవం తిరువూరు మండలంలో ఘనంగా జరిగింది. చిట్టేల, అంజనేయ పురం గ్రామాల్లో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఆంజనేయపురంలో సర్పంచ్ మామి డి కుటుంబరావు, విఆర్ఓ శాంతన్, పంచాయతీ కార్యదర్శి తేనే నరేంద్ర, బి ఎల్ వో అభిషేక్, ఉపా ధ్యాయురాలు కష్ణకుమారి, చిట్టేల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిరువూరు నాగార్జున పాఠశాలలో విద్యార్థులలో పార్లమెంటు పట్ల అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ పార్లమెంటు సభ్యుల పాత్రలను పోషించి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కర స్పాండెంట్ వి.నాగేశ్వరరావు ప్రిన్సిపాల్ కె.నర సింహారావు చైర్మన్ డి.హనుమంతరావు, డైరెక్టర్ కె.శేషగిరిరావు, టి.సూరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్ ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో సర్పంచ్ మన్నె సాత్విక ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పేరకలపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మన్నె సాత్విక మాట్లాడారు. సర్పంచ్ మన్నె సాత్విక తోపాటు గ్రామ వీఆర్వో రామారావు, బిఎల్‌ఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని మున్నలూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొంగర మురలి ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని అమ్మాని కళాశాలలో యువతను ఉద్దేశించి ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కన్వీనర్ సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ప్రసంగించారు. ప్రిన్సిపల్ పి సుధీర్, మున్సిపల్ టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి రాయపూడి వెంకటేశ్వరరావు , కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** తాతకుంట్ల గ్రామం ఎంపిపి స్కూల్లో పలువురు సీనియర్ వోటర్లను సత్కరించారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కొత్త ఓటర్లపై అవగాహన సదస్సు, సీనియర్ సిటిజన్ ఓటర్లకు సన్మానం, విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుండి పాత మున్సిపల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జి.మహేశ్వరరావు, తహశీల్దార్ మనోహర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సిపి కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

'అను'లో అరుదైన చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నగరంలోని అను హాస్పిటల్ వైద్యులు అత్యంత అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి విజయవంతంగా చికిత్స నిర్వహించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. పలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేషెంట్.. చికిత్సానంతరం చక్కగా కోలుకున్నారు. దాదాపు 40 రోజుల పాటు చికిత్సనందించిన అను వైద్యులు.. పేషెంట్ ప్రాణాలను కాపాడి అద్భుతం చేశారు. ఈ అత్యంత అరుదైన, అతి క్లిష్టమైన చికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు అను హాస్పిటల్లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ.. అనేక ఆరోగ్య సమస్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 50 ఏళ్ల వ్యక్తికి తమ హాస్పిటల్‌లో విజయవంతంగా చికిత్స అందించామన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, సర్జరీ, అనస్థీషియా విభాగాల వైద్యులు సమన్వయంతో కృషి చేశారని తెలిపారు అనంతరం, ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ భవానీశంకర్ మాట్లాడుతూ 'లివర్ ఫెయిల్యూర్ తో పొట్టలో నీరు చేరడం, ప్లేట్లెట్స్ పడిపోవడం, హిమోగ్లోబిన్ క్షీణించడం, ఎడమ కాలుకు ఇన్ఫెక్షన్ కావడంతో మోకాలు కింది నుంచి పాదం వరకు పెద్ద గాయంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అను హాస్పిటల్లోని బహుళ విభాగాల ఆధ్వర్యంలో చికిత్స నిర్వహించామన్నారు. 40 రోజుల చికిత్స ఫలితంగా పేషెంట్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జయ్యారు' అని తెలిపారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు, అత్యాధునిక సాధనా సంపత్తి ఒకే చోట ఉండటం ద్వారా, ఈ అత్యంత క్లిష్టమైన ఈ చికిత్సను అను హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించగలిగామని డాక్టర్ భవానీశంకర్ తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సతీష్ చైతన్య, డాక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని నూజివీడు రోడ్లో కోడిపందేల నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.రామ్మోహన రావు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 9 మంది పందేల నిర్వాహకులను, 18 మోటారు బైక్లను, రూ.8150లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని ఎక్కడ జూదం జరిగినా, కోడిపందేలు నిర్వహించినా సహించేది లేదని హెచ్చరించారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని కుంటముక్కల బిఆర్‌డిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాన్ని వాసవ్య మహిళా మండలి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.జయలక్ష్మి మాట్లాడారు.

క్వార్టర్ ఫైనల్‌కు ఎపి జట్టు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్, ఎన్టీఆర్ స్కూల్ గేమ్స్ సంయుక్తంగా విజయవాడలోని పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో నిర్వహిస్తున్న 14 బాల బాలికల సెపక్ తక్రా పోటీల్లో భాగంగా శనివారం లీగ్ పోటీలు పూర్తయ్యాయి. లీగ్ మ్యాచ్‌ల కోసం 12 రాష్ట్ర జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. లీగ్‌లలో అత్యంత ప్రతిభకనబరిచిన ప్రతి గ్రూపులో మొదటి రెండు స్థానాలు పొందిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కి చేరతాయి. క్వార్టర్ ఫైనల్‌కి చేరిన జట్లు బాలుర విభాగంలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టుతో పాటు మణిపూర్, తమిళనాడు, పంజాబ్, గుజరాత్, ఢిల్లీ జట్లు క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నాయి. బాలికల విభాగంలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు మణిపూర్, బీహార్, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ జట్లు నాకౌట్ దశకు చేసుకున్నాయి. కాగా క్వార్టర్ ఫైనల్‌తో పాటు సెమీఫైనల్ పోటీలు ఆదివారం ప్రారంభమవుతాయి. ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్లు గ్రూప్ దశలో సత్తాచాటాయి. ఆడిన రెండు మ్యాచ్‌లలో ఘనవిజయం సాధించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాయి. 2వ రోజు బాలుర విభాగంలో గుజరాత్ బీహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 15-12, 15-11, జార్ఖండ్ ఢిల్లీ మధ్య జరిగిన పోటీలో ఢిల్లీ15-7,15-13, ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్రకు మధ్య జరిగిన పోటీలో ఆంధ్రప్రదేశ్ జట్టు15-7,15-9 పాయింట్స్ తేడాతో విజయం సాధించాయి. బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ బీహార్ మధ్య జరిగిన పోటీలో ఆంధ్రప్రదేశ్ 15-7,15-4 పాయింట్స్ తేడాతో, మణిపూర్ జార్ఖండ్ మధ్య జరిగిన పోటీలో మణిపూర్ 15-4,15-2 పాయింట్స్ తేడాతో, మహారాష్ట్రకు గుజరాత్‌కు మధ్య జరిగిన పోటీలో గుజరాత్ 13-15,11-15 పాయింట్స్ తేడాతో గెలుపొందాయి.


ఆడుతున్న క్రీడాకారులు



ముగిసిన సబ్ జోన్ బాలుర ఆటల పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం : గత రెండు రోజుల నుంచి గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న గన్నవరం సబ్ జోన్ సీనియర్ ,జూనియర్ బాలుర క్రీడలు ఘనంగా శనివారం ముగిశాయి. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుండి సుమారుగా 500 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు .ఇక్కడ ప్రతిభ కనబరిచి విజయం సాధించిన జట్లు ఫిబ్రవరి 4 నుండి జరగబోయే సెంట్రల్ జోన్ పోటీలకు అర్హత సాధించాయి. కో కో క్రీడాంశానికి సంబంధించి జూనియర్ బాలుర విభాగంలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానం, గొల్లనపల్లి హైస్కూల్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. షటిల్ బ్యాట్మెంటన్ కు సంబంధించి గన్నవరం బాలుర హై స్కూల్ జట్టు ప్రథమ స్థానం, ఆత్కూరు హైస్కూల్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. వాలీబాల్ క్రీడాంశానికి సంబంధించి గొల్లనపల్లి హై స్కూల్ ప్రథమ స్థానం, రేమల్లి హైస్కూల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. టెన్నికాయిట్ క్రీడాంశానికి సంబంధించి ప్రథమ స్థానం గొల్లనపల్లి హై స్కూల్ జట్టు , ద్వితీయ స్థానం వీరవల్లి హై స్కూల్ సాధించాయి. సాఫ్ట్ బాల్ క్రీడాంశానికి సంబంధించి గన్నవరం హై స్కూల్ జట్టు ప్రథమ స్థానం , వీరపనేని గూడెం హై స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు గన్నవరం సబ్ జోన్ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను కష్ణాజిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి సిహెచ్ చంద్రశేఖర్ పర్యవే క్షించారు. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల వ్యాయా మ ఉపాధ్యాయులు , పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి దనియాల నాగరాజు పాల్గొన్నారు.

హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఈ నెల 20 వ తేదీ సోమవారం నుండి వారం రోజులపాటు మచిలీపట్నంలో ద్విచక్ర వాహనదార్లకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయంగా రవాణాశాఖ అధికారులు ట్రాఫిక్ పోలీసులతో కలిసి జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కింద సీతానగరంలో హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్ ను పరిశీలించారు. హెల్మెట్ ధరించని వాహన దారులకు హెల్మెట్ వల్ల ఉపయోగాలు వివరించి, హెల్మెట్ ధరించని వారికి అక్కడకక్కడే బిఐఎస్ మార్క్ హెల్మెట్ కొనుగోలు చేసుకునే విధంగా చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించాలని, ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించే విధంగా కరపత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం, ట్రాపిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలు కాపాడుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ విజ్ఞప్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ లో కలెక్టర్ తో పాటు జిల్లా రవాణా అధికారి ఎస్ స్వర్ణ శ్రీనివాస నాయక్, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

రోడ్డు నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : రోడ్డు నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు అవకాశమే ఉండదని రవాణాశాఖ ఉయ్యూరు యూనిట్ అధికారి సుబ్బారావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు పురసరించుకుని శ్రీ విశ్వశాంతి స్కూల్ ఆవరణలో శనివారం స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రత, పాటించవలసిన నియాలపై అవగాహన కల్పించారు. బడిపిల్లలు ఉన్న బస్సు నడిపే డ్రైవర్లు జాగ్రతలు పాటించాలని, బడి బస్సు భద్రత భావి తరాలకు భరోసా అన్నారు. ఎంవీఐ ఆయోష పాల్గొని రోడ్డు నియమాలు, పాటించవలసిన ఆవశ్యకతను తెలియచేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పదవ తరగతి విద్యార్థులకు స్టడిమెటీరియల్ నుడెమో క్రటిక్ పిఆర్‌టియు సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను రూపొందించిన మెటీరియల్ ను శనివారం వల్లూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అందించారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు ఎం. శ్రీనివాసురావు ఎంఈఓలు వెంకటేశ్వరరావు, సురేష్ ల చేతుల మీదగా నాలుగు ఉన్నత పాఠశా లల ప్రధాన ఉపాధ్యాయులకు అందజేశారు.

ఆర్ట్ ఆఫ్ గ్యాలరీలో పాల్గొన్న విక్కుర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుతో కలసి హైదరాబాదులో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాసరావు ఆర్ట్ ఆఫ్ గ్యాలరీ కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం హైదరాబాదులోని మాదాపూర్ కావూరి హిల్స్‌లో గల స్టేట్ గ్యాలరీ ఆర్ట్ లో విశ్రాంతి చీఫ్ ఇంజనీర్ పి శ్రీనివాసరావు కుమార్తె పి వర్ధిని ఏర్పాటు చేసిన ఇంగ్ మ్యాటిక్(ఏ సోలో ఆర్ట్ షో) కార్యక్రమాన్ని వెంకయ్య నాయుడు ప్రారంభించారు. వెంకయ్య నాయుడుతో పాటు వి శ్రీనివాస్ పి శ్రీనివాసరావు లు జ్యోతి ప్రజ్వల చేసి ఆర్ట్ ఆఫ్ గ్యాలరీని ప్రారంభించారు.

ఓటు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలి

- జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-గుడివాడ : దేశ భవిష్యత్తు నిర్దేశించేది ఓటర్లని, అలాంటి ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరు గుర్తించాలని గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గుడివాడ ఆర్డీవో కార్యాలయం నుండి ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు అధికారులు, విద్యార్థులు ఓటు విలువపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాలలో ఆర్డీవో బాలసుబ్రమణ్యం అధికారులు, విద్యార్థులు ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆర్టీవో బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం 365 రోజులు ఓటర్ల దరఖాస్తు, మార్పులు చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కలిగించిందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అధికారులు బహుమతులను అందజేశారు. తాసిల్దార్ రామకోటేశ్వరరావు,అసిస్టెంట్ కమిషనర్ పి, శ్రీనివాస్, 2టౌన్ సీఐ చిన్నినాగ ప్రసాద్, ఆర్డిఓ కార్యాలయ ఏవో బాలాజీ పాల్గొన్నారు.

కెయూలో ఓటు నమోదుపై చైతన్య ర్యాలీ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : యుక్త వయసు వచ్చిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం విశ్వ విద్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పెద, ధనిక అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓటరు దినోత్సవం సందర్భముగా పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు, ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి, ప్రోగ్రామ్ అధికారులు డా స్వరూపా, డా రవి, డా శేష రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పి గోపి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా శనివారం మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో జంగం స్వర్ణ భారతి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గవాణి, కార్యాలయ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు లో మండల తాసిల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రధాన రహదారుల్లో ఓటు హక్కు మన జన్మ హక్కు అనే నినాదాలతో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేశారు. మండల తాసిల్దార్ బి లోకరాజు, ఎంఈఓ లు జి. గోపాలరావు, జి జగన్ మోహన్ రావు, ఆర్ ఐ శివకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.**ప్రజాశక్తి మోపిదేవి :** మండల పరిధిలోని కొక్కిలిగడ్డలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం సర్పంచ్ కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన 92 సంవత్సరాలు గల సీనియర్ ఓటర్ చెదలవాడ సీతారామయ్యను సర్పంచ్ రాంబాబు ఘనంగా సత్కరించారు.ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గుంటూరు ఉద్విత మొదటి బహుమతిని, తుటారం యశస్వి నాగమహాలక్ష్మి ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. బూత్ లెవెల్ అధికారి పాగోలు వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు బచ్చు సీతారామాంజనేయులు, వీఆర్వో కళ్లేపల్లి వర ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూ రు నగరపంచాయతీ, మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో ఏజీఅండ్ఎస్ ఎస్ కళాశాల విద్యార్థులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయ తీ చైర్మన్ వి సత్యనారాయణ, కమిషనర్ పి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం సురేశ్ కుమార్ పాల్గొని ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువను తెలియచేశారు. ఈసందర్భంగా సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. అలాగే మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎండిఒ శేషగిరిరావు పాల్గొని కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** ఓటరు దినోత్సవం సందర్భంగా సిద్దార్థ డీమ్డ్ యూనివర్సిటి నుండి తాడిగడప వంద అడుగుల రోడ్ వరకు విధ్యార్థులతో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పర్చూరి వెంకటేశ్వరరావు,రవి చంద్, రిజిస్ట్రార్, పెనమలూరు మండల తహశీల్దారు కలగర గోపాల కష్ణ, వై.యస్.ఆర్.తాడిగడప పుర పాలక సంఘ కమీషనర్ భవానీ ప్రసాద్, పెనమలూరు నియోజకవర్గ ఎన్నికల ఉప తహశీల్దార్ రాజు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో మాట్లాడుతున్న ఆర్‌డివో



కృష్ణాయూనివర్శిటీలో పాల్గొన్న ఉద్యోగులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రంగనాథ బాబు

విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి-ఘంటసాల : విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఘంటసాలకు చెందిన ప్రవాస భారతీయులు ప్రముఖ పారిశ్రామికవేత్త గొర్రెపాటి రంగనాథ బాబు తెలిపారు. శనివారం రాత్రి ఘంటసాల లో యు.వి. ఆర్. గొర్రెపాటి స్కూల్ ప్రథమ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు . గ్రామీణ ప్రాంతంలో మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు తమ తల్లిదండ్రులు ఉదయ భాస్కరమ్మ- వెంకట్రాయలు పేరిట స్కూలును నిర్మించినట్లు తెలిపారు. ప్రాథమిక హై స్కూల్ స్థాయి విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఉండేందుకు చిన్నారులకు, బాల బాలికలకు స్కూల్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ లోయ నాగేశ్వరరావు, ఎంపీపీ వేమూరి రజనీ కుమారి ,జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకష్ణ, విజయ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపల్ నా గళ్ళ భీమారావు, ఏవో జవహర్ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-మోపిదేవి : యువ నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు మహిళలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదిటి జనార్దన్‌రావు తెలిపారు శనివారం మోపిదేవిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను ఆయన మహిళలకు అందజేశారు. తెలుగు యువత రాష్ట్ర నాయకులు రావి రత్నగిరి, జిల్లా రైతు నాయకులు గవిని శివరామకష్ణ పాల సొసైటీ అధ్యక్షులు బొందలపాటి ప్రసాద్ రావు, పంచాయతీ వార్డు మెంబర్ కొలుసు శివ రాజేష్ పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంపొందించాలనీ, సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా వారిని చైతన్యపరచాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, మెప్మా పీడీ పి. సాయిబాబు సూచించారు. శనివారం ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ, మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ ప్లాంట్ కెపాసిటీ ద్వారా 300 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించుకోవచ్చనీ, రూ.78వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. గహ అవసరాలకు పోను మిగిలిన విద్యుత్ను విద్యుత్ శాఖ కొనుగోలు చేసి తగిన మొత్తం అందిస్తారని తెలిపారు. సబ్సిడీపోగా మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణం పొందవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్ సూర్యుని వేడిని పీల్చుకోవటం వల్ల ఇళ్లు చల్లగా ఉంటాయనీ, ప్యానెల్స్ చుట్టూ చల్లటిగాలి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి సుబ్బారావు, విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : నియోజకవర్గంలో రూ.4.65 లక్షలతో 241 గోకులం షెడ్లు నిర్మిస్తున్నట్లు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డలో లబ్ధిదా రుడు డొక్కు నాగబాబు ఉపాధి నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించుకున్న 50 గొర్రెల గోకులం షెడ్డును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకుల ఆర్థిక ప్రగతికి ప్రోత్సాహం అందించేందుకు విస్తత సంఖ్యలో గోకులం షెడ్ల నిర్మాణానికి ఉపాధి పథకం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి పాల్గొన్నారు.

33 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల పరిధిలోగల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు చెన్నైకు చెందిన సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు శనివారం కళాశాలలో బిటెక్, ఎంసిఎ, ఎంబిఎ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు.



రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై నగరంలోని ప్రధాన కూడళ్లలో కరపత్రాలు పంపిణీ చేశారు. శనివారం ఉదయం విజయవాడలోని బెంజిసర్కిల్ , మధ్యాహ్నం రవాణాశాఖ కార్యాలయంతోపాటు మహానాడు రోడ్డు దగ్గర కరపత్రాల పంపిణీ చేపట్టారు. సాయంత్రం ఆటోనగర్ లో బుర్రకథ ద్వారా రహదారి భద్రతపై అవగాహన కలిగించారు. బెంజి సర్కిల్ దగ్గర హెల్మెట్, సీటుబెల్టు ధరించడంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో అధ్యక్షులు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షులు కె.వి.ఎస్.చలపతిరావు, కె.సత్యనారాయణ రాజు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, సొసైటీ అధ్యక్షులు కోనేరు వెంకట రమేష్, చెన్నుపాటి వజీర్, తుమ్మల లక్ష్మణస్వామి, సూరపనేని సురేష్, అడుసుమిల్లి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీన్ ఆచార్య రాజేష్

పిబి సిద్ధార్థలో డేటాసైన్స్, ఎఐ కార్యశాల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ విభాగం సంయుక్తంగా శనివారం కళాశాలలోని వెబినార్ హాలులో ఎ.ఐ.ఇగ్నైట్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. తొలుత కృత్రిమమేధకు సంబంధించిన ఈ సాంకేతిక కార్యశాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీ జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. రేపటితరాన్ని శాసించే కృత్రిమమేధతో మానవమేధస్సు పోటీపడక తప్పని అనివార్య సాంకేతికయుగంలో మనం ఉన్నామని, అనుక్షణం అప్రమత్తత అవసరమని వక్తలు అన్నారు. మొత్తం 40 బృందాలుగా 160 మంది వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఈ సాంకేతిక కార్యశాలలో పాల్గొని నిర్దేశించిన టాస్క్‌ను ల్యాపీలపై పూర్తిచేసేందుకు పోటీపడ్డారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి టీంకు 10 వేలు, రెండో బృందానికి ఎనిమిది వేల రూపాయల నగదు బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతగా అమిగ్డా ల్యాబ్ (యూకే)కి చెందిన చక్కా గుణశేఖర్ వెంకట చెన్నయ్య వ్యవహరించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థి బృందాలకు సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సీఈఓ క్రాంతికుమార్, గ్లోబల్ డిగ్రీస్ సంస్థ మార్కెటింగ్ హెడ్ జి.శ్రీనివాసరావు ప్రశంసపత్రాలు అందజేశారు. డేటా సైన్స్ శాఖాధిపతి డా.కె ఉదయశ్రీ, అధ్యాపకులు సంహిత, గాయత్రి, సౌమ్య ఈవెంటును పర్యవేక్షించారు.

మ్యాంగో మార్కెట్ కార్మికుల సమ్మె సైరన్ మోగనుందా !

మ్యాంగో మార్కెట్ అసోసియేషన్ వైఖరితో సమ్మె సైరన్ దిశగా కార్మికులు సిద్ధమవుతున్నారు. న్యాయబద్ధమైన, సాంప్రదాయంగా కార్మికులకు ఇస్తున్న రెండు కూలీలు ఇచ్చే అంశాన్ని ఆదివారం సాయంత్రం లోపు వ్యాపారుల అసోసియేషన్ తేల్చుకుంటే సోమవారం నుంచి పని బంద్ చేస్తామని వందలాది మంది కార్మికులు స్పష్టం చేస్తున్నారు. మ్యాంగో మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి అని కార్మికులు గుర్తు చేస్తున్నారు. ఎంతో ప్రశాంత వాతావరణంలో అటు వ్యాపారులు, ఇటు కార్మికులు కలిసి మెలిసి ఉంటూ రోజుకు కోట్లాది రూపాయల వ్యాపారం చేసే మార్కెట్‌లో పని బంద్ చేసే వరకు పరిస్థితి రావడానికి మూల కారణం కొత్తగా వ్యాపారులుగా అవతారం ఎత్తిన పలువురు వైఖరే కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఎంతో అనుభవం ఉండి, కార్మికుల కష్టాలు తెలిసిన అసోసియేషన్ నేతలు కూడా వారి దిశలోనే ఆలోచిస్తూ, అసలకే మోసం అన్నట్లుగా వ్యవహరిస్తుండటాన్ని కార్మికులు, వీరికి అండగా నిలిచిన కార్మిక సంఘాలు, సిపిఎం, సిపిఐ తీవ్రంగా తప్పుపడుతున్నాయి. కూలి అంశంలో వ్యాపారుల వైఖరికి నిరసనగా శుక్రవారం మార్కెట్ మొత్తం స్తంభించింది. పని బంద్ చేసి వందలాది మంది కార్మికులు నిరసన తెలిపారు. శనివారం కూడా కార్మికులతో కార్మిక సంఘాలు, సిపిఎం, సిపిఐ నేతలు జనరల్ బాడీ సమావేశం నిర్వహించి, వ్యాపారుల వైఖరిని కార్మికులకు వివరించారు. ఇటీవల కాలంలో మార్కెట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు శుక్ర, శనివారం రెండు రోజుల పాటు జరిగిన ఘటనలు కార్మికుల పట్ల అసోసియేషన్ సభ్యుల వైఖరి వెరసి, సమస్య జటిలమైంది. సమ్మె దిశగా, పని బంద్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయని కార్మికులు, కార్మిక సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. అసోసియేషన్ నేతలకు కార్మికులు ఆదివారం సాయంత్రం లోపు డెడ్‌లైన్ విధించారు. ఈ లోపు కార్మికుల కష్ట-నష్టాలను తెలుసుకొని సామరస్య పూర్వకంగా సమస్యను పరిష్కరిస్తే సరే... లేదంటే పోరాటానికి సై అని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితికి దారి తీయడానికి వ్యాపారులే ముఖ్యకారణమని కార్మికులు మండిపడుతున్నారు. మార్కెట్లో కార్మికులకు సాంప్రదాయంగా ఇస్తూ వస్తున్న

వీక్షణం

రెండు కూలీలు అంశంపై చర్చించడానికి ఎడిసిపి రామకృష్ణ నేతృత్వంలో శనివారం సాయంత్రం జరగాల్సిన చర్చలకు కార్మికుల తరుపున కార్మిక సంఘాలు, సిపిఎం, సిపిఐ నేతలు హాజరుకాగా, అసోసియేషన్ సభ్యులు మొహం చాటేసి, సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యేను ఆశ్రయించి, ఆయన సలహాను కోరినట్లు తెలిసింది. దీనిపై కార్మికుల్లో తీవ్ర అసహనం, నిరసన వ్యక్తం అవుతుంది. మ్యాంగో మార్కెట్‌లో పని చేస్తున్న ముఠా కార్మికులకు రెండు కూలీలు ఇచ్చే సాంప్రదాయం అనాదిగా, సాంప్రదాయంగా కొనసాగుతుంది. కానీ ఇటీవల కాలంలో ఇక్కడే పని చేస్తూ కొత్తకొత్త వ్యక్తులు వ్యాపారులుగా అవతారం ఎత్తి చివరకు కార్మికుల పొట్ట కొట్టాలనే పేరాశతో ఒక్క కూలీ మాత్రమే ఇస్తామని, గడిచిన ఈ రెండు, మూడు మాసాల నుంచి మార్కెట్‌లో అలజడి సృష్టిస్తున్నారు. మార్కెట్‌లో బండిలో నుంచి మరో బండికి సరుకు వేసినా, ఇదే సరుకున్న బండిని వేరే పార్టీకి పంపినా కార్మికులకు రెండు కూలీలు వ్యాపారులు ఇస్తుంటారు. గడిచిన ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన చర్చల్లో కూడా ఇదే విధంగా కార్మిక సంఘాలతో అసోసియేషన్ సభ్యులు ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. అయితే అసోసియేషన్ కుదుర్చుకున్న ఒప్పందానికి భిన్నంగా పలువురు వ్యాపారులు ఒక్క కూలి మాత్రమే ఇస్తున్నారు. దీంతో న్యాయబద్ధంగా కార్మికులకు రావాల్సిన కూలిలో సగానికి సగం తగ్గిపోతోందని వారు వాపోతున్నారు. ఉదాహరణకు సగటు కార్మికుడికి ఇప్పటి వరకు రోజుకు రూ.ఎనిమిది వందలు కూలి వస్తుంటే వ్యాపారులంటున్నట్లు ఒక కూలి వల్ల సగం కూలి కార్మికుడు కోల్పోవాల్సి వస్తోంది. ఎటువంటి కార్మిక చట్టాలు అమలు కాకుండా, కనీస సదుపాయాలు కరువై... పని భద్రత లేక, అనారోగ్యాలు పాలవుతూ రోజంతా (రాత్రింబవళ్లు) పని చేసినా...చివరకు కార్మికుడికి మిగిలేది ఏమి ఉండదని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. రెండు కూలీల విధానాన్ని యధావిధిగా అమలు చేయడంతో పాటు సమగ్ర చట్టం చేయాలని, పని భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని సిఐటియు, ఎఐటియుసి నేతలు డిమాండ్ చేస్తున్నారు. కార్మికులు చేపట్టే న్యాయబద్ధమైన పోరాటానికి తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని సిపిఎం, సిపిఐ నేతలు స్పష్టం చేస్తున్నారు. అయితే అసోసియేషన్ నేతలు కూడా సానుకూలంగా ఆలోచించి, సమ్మెవరకూ తీసుకెళ్లకుండా ఉండాలని పలువురు వ్యాపారులు కూడా కోరుకుంటున్నారు.

- విహెచ్‌ఆర్

పేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు : మంత్రికి ఎంఎల్ఎ వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను వారి స్వగృహంలో శనివారం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాలకు నిధులు కేటాయించాలని, రెండు నెలల క్రితం అకాల వర్షాల కారణంగా ముంపునకు గురైన జగ్గయ్యపేట పట్టణంలోని వార్డులను ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. రోడ్లు, పైపులైన్లు, డ్రైన్లు మొదలుకొని చాలా వరకు పాడైపోయాయని సుమారు రూ.14 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని, ప్రత్యేక నిధులు కేటాయించి ఆ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంచినీటి పైపులపై ప్రత్యేక దృష్టి కేటాయించాలని, జగ్గయ్యపేట పట్టణానికి కృష్ణాజిల్లాలు తీసుకురావడానికి కృషి చేశామని తెలిపారు. టిట్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, జగ్గయ్యపేట పట్టణంలో సుమారు 3160 కుటుంబాల కలైన టిడ్కో ఇళ్లని పూర్తి చేయాలని కోరారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో అవగాహన నిమిత్తం ప్రత్యేక అధికారులను జగ్గయ్యపేట పంపించి కావాల్సిన నిధులపై ప్రణాళిక ఏర్పాటు చేసి ప్రణాళిక బద్ధంగా ప్రత్యేక నిధులు కేటాయిస్తామని జగ్గయ్యపేట అభివద్ధికి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. సిఆర్‌డిఎ పరిధిలో ఉన్న జగ్గయ్యపేటను ఆకర్షణీయ జగ్గయ్యపేటగా తీర్చిదిద్దుతామని, వీలు చూసుకొని జగ్గయ్యపేట వచ్చి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు పెరం సైదేశ్వర రావు పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్ఎ శ్రీరాం, కమిషనర్ రాఘవేంద్ర

మల్టీ అసెట్ ఫండ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రసిద్ధ ఫండ్ హౌస్‌లలో ఒకటైన ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ, డెట్, బంగారంలో పెట్టుబడి పెట్టే ఓపెన్ ఎండ్ స్కీమ్ అయిన ఎల్ఐసి ఎంఎఫ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇంఛార్జి కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఫండ్ ఆఫర్ ఈ నెల 24న ప్రారంభమై ఫిబ్రవరి 7న ముగుస్తుందన్నారు. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత ఇన్‌స్ట్రుమెంట్‌లు, డెట్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ల యూనిట్ల వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక మూలధన పెరుగుదలను సష్టించడం ఈ పథకం యొక్క పెట్టుబడి లక్ష్యమని సంస్థ పేర్కొన్నారు. వివరాలకు నగరంలోని సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

నగరంలో రాచరికం యూనిట్ సందడి



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజయవాడ నగరంలో రాచరికం చిత్ర యూనిట్ సందడి చేసింది. జనవరి 31వ తేదీన విడుదల కానున్న తమ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని హీరో విజయ్ శేఖర్ కోరారు. మొగల్రాజపురంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరో విజయ్ శేఖర్ మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంలో రాచరికం చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రముఖ హీరో వరుణ్ సందేశ్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో మొదటిసారిగా నటిస్తున్నారని, ఆయన నటన చిత్రానికి హైలెట్‌గా ఉంటుందని తెలిపారు. ఈ చిత్రంలో అప్సర రాణి నటన తెలుగు ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ చిత్రానికి ఇండస్ట్రీకి సంబంధించిన ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేశారని పేర్కొన్నారు. అనంతరం హీరోయిన్ అప్సర రాణి మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనంతో విజయవాడ నగరంలో రాచరికం సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విజయవాడ ప్రేక్షకులు తమను ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. రాచరికం చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా ఉందని ఈనెల 31న విడుదల కానున్న చట్టాన్ని ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని ఆమె కోరారు. అనంతరం దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించామని, రాచరిక వ్యవస్థ అంటే ఏంటి, ఆ రోజుల్లో ఆ వ్యవస్థ ఎలా ఉండేదనేది ఈ చిత్రం ద్వారా నేటితరం ప్రేక్షకులకు తెలియజేయనున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో కామెడీ, ప్రేమ, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఉర్రుతలూగిస్తాయని తెలిపారు. తమ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాతలు ఈశ్వర్ చాణిక్య పాల్గొన్నారు.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎస్ 25 సిరీస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సామ్‌సంగ్ తమ తాజా గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 25 ప్లస్ గెలాక్సీ ఎస్ 25 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసినట్లు సంస్థ బిజినెస్ హెడ్ టి.ఎం.రోహిత్ అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇప్పటివరకు సృష్టించిన అత్యంత సహజమైన, సందర్భోచిత మొబైల్ అనుభవాలతో నిజమైన ఏఐ సహచరుడిగా నూతన ప్రమాణాన్ని నెలకొల్పాయన్నారు. 'ప్రతి ఒక్కరూ తమ పరికరాలతో మరింత సహజంగా, సౌకర్యవంతంగా సంభాషించడానికి సహాయపడటానికి గెలాక్సీ ఎఐని అభివృద్ధి చేశామని తెలిపారు. అదే సమయంలో వారి గోప్యత సురక్షితంగా ఉందని విశ్వసిస్తున్నామని రోహిత్ అన్నారు.